క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 11న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. సిద్ధార్థనగర్ ప్రాంతంలో ఉదయం 10.15 నుంచి 11.15 వరకు, సమ్మయ్యనగర్, కుడా కాలనీ, శంకర్ నగర్, ఆదర్శనగర్ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, హంటర్ రోడ్డు టెంపుల్ ట్రీ విల్లాస్ ప్రాంతంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. నర్సంపేట రోడ్డు, 100 ఫీట్ రోడ్డు, చెన్నారెడ్డి కాలనీ, ఎస్ఆర్‌టీ కాలనీ, లేబర్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

13వరకు రైతు బీమాకు గడువు

హసన్‌పర్తి: రైతు బీమా పథకం నమోదుకు ఈనెల 13వ తేదీ వరకు గడువు ఉందని మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సురేందర్ రెడ్డి తెలిపారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు కలిగిన రైతులు మండల విస్తీర్ణాధికారి, మండల వ్యవసాయాధికారిని సంప్రదించాలని సూచించారు. 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వయస్సులోపు రైతులు అర్హులని చెప్పారు.

సుధీర్‌కుమార్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకుడు సుధీర్‌కుమార్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ప్రాక్టీసెస్ ఇన్ రిటైల్ ఇండస్ట్రీ ఏ కేస్ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సుధీర్‌కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సీహెచ్.బలరాములు పర్యవేక్షణలో సుధీర్ కుమార్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

బీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా శివకుమార్



న్యూశాయంపేట: తెలంగాణ బీసీ ప్రజాసంఘం వరంగల్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా రంగశాయిపేటకు చెందిన య.శివకుమార్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్ తెలిపారు. ఈ మేరకు ఓసిటీలో ఆదివారం జరిగిన సమావేశంలో శివకుమార్‌కు నియామక పత్రం అందచేశారు. కాగా, తన నియామకానికి సహకరించిన నాయకులకు శివకుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

24న ఆర్యవైశ్య మహాసభ రాజకీయ సమ్మేళనం



రామన్నపేట: ఆర్యవైశ్యులు ఐక్యతతో పాటు రాజకీయంగా ఎదగాలనే ఉద్దేశంతో ఈ నెల 24న ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండలోని టీటీడీ దేవస్థాన కల్యాణ మండపంలో నిర్వహించే ఆర్యవైశ్య మహాసభ రాజకీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరావతి లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఈమేరకు నగరంలోని గోల్డెన్ గార్డెన్‌లో నాయకులతో కలిసి సమ్మేళనానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు రాజకీయ ఎదుగుతూ చట్టసభల్లో కూడా ముఖ్య పాత్ర పోషించాలనే లక్ష్యంతో ఈ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ, మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు ఆగిరి వెంకటేష్, వంగేటి అశోక్‌కుమార్, వరంగల్, జనగామ జిల్లాల అధ్యక్షులు దుబ్బా శ్రీనివాస్, గంగిశెట్టి ప్రమోద్ కుమార్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డి మోహన్‌రావు, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యదర్శి గార్లపాటి శ్రీనివాస్, వరంగల్ జిల్లా కోశాధికారి గందె శ్రీనివాస్ గుప్తా, నాయకులు సదాశివుడు, సత్యనారాయణ, సంతోష్, వీరేందర్, వీరభద్రయ్య, మురళీధర్, అశోక్, రాజు, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మామునూరు: వరంగల్ – నెక్కొండ రోడ్డుపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. ఖిలా వరంగల్‌కు చెందిన పెరుగు రాంచరణ్ నక్కలపల్లి రైస్ మిల్లుల వద్ద రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టి వెళ్లింది. దాంతో అతడికి తీవ్ర గాయాలు కాగా, 108 వాహనంలో స్థానికులు ఎంజీఎంకు తరలించారు.

వైభవంగా పోచమ్మ తల్లి బోనాలు



ఖిలా వరంగల్: పోచమ్మ దేవాలయం వద్ద..



కాజీపేట: ప్రశాంత్‌నగర్ కాలనీలో..



హన్మకొండ: బోనాలతో పోచమ్మ దేవాలయానికి వెళ్తున్న హనుమకొండ గాంధీనగర్ వాసులు



కాజీపేట అర్బన్: ఇందిరమ్మ కాలనీలో బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

- బోనమెత్తిన మహిళలు
- భక్తిశ్రద్ధలతో మొక్కులు



హన్మకొండ కల్చరల్: ఓసిటీలో పోచమ్మ బోనాల వేడుక



హసన్‌పర్తి: బోనాలతో ప్రదర్శనగా ఆలయానికి వెళ్తున్న మహిళలు, భక్తులు



మడికొండ: మొక్కులు చెల్లిస్తున్న మహిళలు



పోచమ్మను దర్శించుకుంటున్న నరేందర్

ఖిలా వరంగల్: శ్రావణమాసం సందర్భంగా నగరంలో పోచమ్మతల్లి బోనాల పండుగను ప్రజలు ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. భక్తిశ్రద్ధలతో మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకొని పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలో కోళ్లు, మేకలు, కల్లుకావళ్లతో ఆలయాలకు చేరుకుని నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో కర్ని రవీందర్, మంగపేట తహసీల్దార్ తోట రవీందర్, జగదీశ్వర్, వాసుదేవ్, సదానందం, సత్యనారాయణ పాల్గొన్నారు. వరంగల్ గాంధీనగర్‌లోని పోచమ్మ దేవాలయంలోని అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆదివారం సాయంత్రం దర్శించుకున్నారు.

మైసమ్మ తల్లికి ఎమ్మెల్యే నాయిని పూజలు

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ వడ్డేపల్లి చెరువు కట్టపై ఉన్న మైసమ్మ తల్లికి ఆదివారం జరిగిన బోనాల ఉత్సవంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వడ్డేపల్లి గ్రామస్తులతో పాటు పలు కాలనీలకు చెందిన ముదిరాజ్ కులస్తులు బోనాలతో ఊరేగింపుగా వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నాగరాజు బంక సరళ, విజయశ్రీ రజాలీ, నాయిని లక్ష్మారెడ్డి, దీపక్ రెడ్డి, తాళ్లపల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్ కాలనీలో..

కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ పార్కులో పోచమ్మ తల్లికి కాలనీవాసులు ఆదివారం బోనాలు సమర్పించారు. మొదటి బోనం కుమ్మరి కులస్తులు సమర్పించిన వెంటనే మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

గాంధీనగర్‌లో..

హన్మకొండ: హనుమకొండ గాంధీనగర్ వాసులు ఆదివారం బోనాల పండుగ జరుపుకున్నారు. కాలనీ మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో గాంధీనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకట రాజిరెడ్డి, కార్యదర్శి సట్ల సత్తయ్య, సభ్యులు కొండ యాదగిరి, కేతిరి జనార్దన్ రెడ్డి, ఎస్.అశోక్ రెడ్డి, జి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలో ఆదివారం పోచమ్మ తల్లి బోనాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మహిళలు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు మారం సుధాకర్, నాయకులు కాల్వ కట్లమల్లు, దాడి చిరంజీవి, వేల్పుల సదానందం, అట్ల కర్ణాకర్, మారం సదానందం, వేల్పుల సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ తల్లికి అభిషేకం

ఎర్రగట్టు సమీపంలోని పోచమ్మ ఆలయంలో పంచామృతాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్ రెడ్డి, నంది శ్రీనివాస్, మూల దేవేందర్, సమ్మయ్య, నరోత్తంరెడ్డి, ప్రవీణ్, రమేష్, కనకాచారి, నందంతో పాటు మహిళలు పాల్గొన్నారు.

ఓసిటీలో బోనాల సందడి

హన్మకొండ కల్చరల్: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని వరంగల్ ఓ సిటీలో పోచమ్మ బోనాల పండుగను ఆదివారం నిర్వహించారు. కాలనీలోని మహిళలు ఉదయాన్నే బోనాలతో పోచమ్మగుడికి తరలివెళ్లి సమర్పించారు. కార్యక్రమంలో ఓసిటీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, విజయ్, కంచ సారయ్య, సంపత్, అశోక్, గణేష్ కుమార్, రవి, గణపతి, సదానందం, మల్లయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో..

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో ఆదివారం శ్రావణమాస బోనాల వేడుకలను ఆదివారం జరుపుకున్నారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల నృత్యాల మధ్య మహిళలు బోనాలతో ఆలయాలకు తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

46, 64వ డివిజన్లలో..

మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46, 64వ డివిజన్ల పరిధిలోని మడికొండ, రాంపూర్, టేకులగూడెం, ఉనికిచర్ల గ్రామాల్లో పోచమ్మ తల్లి బోనాలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యాటపోతులు, కోళ్లను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు



జనావాసాల్లో పెరిగిన ముళ్లపొదలు

- విషసర్పాల సంచారంతో భయాందోళనలో స్థానికులు

మడికొండ: గ్రేటర్ వరంగల్‌లోని 46వ డివిజన్‌లోని పలు కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు, ముళ్ల చెట్లు ఏపుగా పెరిగాయి. దాంతో విష సర్పాలు సంచరించడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం, వ్యర్థాలకు తోడు పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో పందులు, విషసర్పాల సంచరిస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఖాళీ స్థలాల్లో నీరు నిలవడంతో దోమలు బెడద అధికమైంది.

చిట్టడవులను తలపిస్తున్నాయి..

డివిజన్‌లోని మడికొండ, రాంపూర్ ప్రాంతాలు నగరానికి ఆనుకుని ఉండటంతో చాలామంది ప్లాట్లు కొనుగోలు చేసి నిర్మాణాలు చేపట్టకుండా ఉన్నారు. అనేక ఏళ్లుగా ఖాళీగా ఉండడంతో ఆ స్థలాలు చిన్నపాటి చిట్టడవులను తలపిస్తున్నాయి. ఈ గ్రామాలు గ్రేటర్‌లో విలీనం అయినప్పటికీ ఖాళీ స్థలాల యజమానులకు అధికారులు నోటీసులు జారీ చేయకుండా తాత్సారం చేస్తున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్‌లో ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు, ముళ్ల చెట్లు ఏపుగా పెరిగాయి. దాంతో పందులు, విష సర్పాల బెడద అధికమైంది. అలాగే, దోమలు వృద్ధి చెంది కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాలని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. పలు కాలనీల్లో వీధి లైట్లు సైతం వెలగడం లేదు.

– దువ్వ వినయ్, స్థానికుడు

ఓట్ల తొలగింపు ప్రజాస్వామ్యానికి విఘాతం



మాట్లాడుతున్న కర్రె భిక్షపతి

న్యూశాయంపేట: దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా నుంచి పెద్దమొత్తంలో ఓట్లు తొలగించడం ప్రజాస్వామ్యానికి అతిపెద్ద విఘాతమని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆవేదన వ్యక్తం చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో హనుమకొండ మండల సమితి -1 సమావేశం అలువాల రాజు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ స్థానిక సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు ఉద్యమ పోరాటాలు చేయాలని సూచించారు. ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరగనున్న పార్టీ 4వ రాష్ట్ర మహాసభలకు తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు టి.భిక్షపతి, ఏ.శ్రీనివాస్, మండల కార్యదర్శి అశోక్ స్టాలిన్, మండల నాయకులు సుదర్శన్, రాజేందర్, రాంగోపాల్, కృష్ణ, అమృతయ్య, రమేష్, దేవా, బాబు, సదానందం, పద్మ, మంగ, దామోదర్, డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్వేషాలను రెచ్చగొడుతున్న కేంద్రం



మాట్లాడుతున్న మాలోతు సాగర్

ఖిలా వరంగల్: ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తూ, మతం, భాషల పేరుతో విద్వేషాలను సృష్టిస్తూ రాజకీయ లబ్ధి కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాకులాడుతోందని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, నగర కార్యదర్శి మాలోతు సాగర్, సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, కన్వీనర్ మహబూబ్ పాషా విమర్శించారు. ఎస్కే హైమద్ అధ్యక్షతన నగరంలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అడుగులకు మడుగులొత్తుతూ దేశప్రజల ప్రయోజనాలను తాకట్టు పెడుతోందని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీలకు 42శాతం రిజర్వేషన్లను పార్లమెంట్‌లో ఆమోదించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సుంచు జగదీశ్వర్, శ్రీనివాస్, హజీమ్, అజ్మత్, హైమత్, ఆదామ్, ఫిరోజ్, షేర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించాలని వినతి



ఎంపీకి వినతిపత్రం అందిస్తున్న భూ బాధితులు

కాజీపేట రూరల్: కాజీపేట మండలం అయోధ్యపురంలో నిర్మిస్తున్న మల్టీపర్పస్ కోచ్ ఫ్యాక్టరీలో తమకు ఉద్యోగావకాశాలు కల్పించి తమ కుటుంబాలను ఆదుకోవాలని అయోధ్యపురం భూ నిర్వాసితులు కోరారు. ఈ మేరకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ గాదం యాదగిరి మాట్లాడుతూ రైల్వే యూనిట్‌లో గ్రామస్తులు సుమారు 152 ఎకరాల భూమి కోల్పోయారని తెలిపారు. కార్యక్రమంలో మెరుగు రాజయ్య, వీరయ్య, మామిండ్ల భిక్షపతి, ప్రవీణ్‌కుమార్, కాయిత కుమార్, గాదెం విజయ్‌కుమార్, బైరబోయిన రాజు, ఇలాసాగరం రాజు, జేరిపోతుల అనిల్, కాయిత కుమారస్వామి, గాదెం శ్రీనివాస్, జేరిపోతుల వినోద్, తదితరులు పాల్గొన్నారు.

పోషకాల దివ్య ఫలం.. డ్రాగన్ ఫ్రూట్

కాజీపేట రూరల్: సామాన్యులకు సీజనల్ ఫ్రూట్‌లో డ్రాగన్ ఫ్రూట్ దివ్య ఫలం లాంటిది. విదేశీ పండు అయిన ఈ డ్రాగన్ ఫ్రూట్.. ఇప్పుడు రైతులు తమ వద్ద కూడా పండిస్తున్నారు. డ్రాగన్ ఫ్రూట్‌లో విటమిన్ సీ, ఐరన్, మెగ్నీషియం ఎక్కువ ఉంటుంది. ఈ పండులో నీరు, పీచు సమృద్ధిగా ఉండడంతో జీర్ణక్రియను మెరుగు పరిచి, మలబద్ధకాన్ని నివారిస్తుంది. గుండె జబ్బులను దరి చేరనివ్వదు. డ్రాగన్ ఫ్రూట్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మానికి ఎంతో మేలు చేయడంతో పాటు రోగనిరోధక శక్తిని కూడా పెంచుతాయి. ఈ పండులో ఉండే ఒమేగా ఫ్యాట్స్, మంచి కొలెస్ట్రాలను పెంచుతుంది. శరీరానికి హాని కలిగించే ఫ్రీ రాడికల్‌ను నాశనం చేసి క్యాన్సర్ ముప్పును అడ్డుకుంటుందని వైద్యులు చెబుతున్నారు. పిల్లలు, పెద్దలు సీజనల్‌లో వచ్చే ప్రతీ పండును తింటే శరీరానికి ఎంతో శక్తితో పాటు ఆరోగ్యంగా ఉంటారని అంటున్నారు. డ్రాగన్ ఫ్రూట్ మార్కెట్‌లో రూ.40, రూ.50తో పాటు సైజును బట్టి కిలోకు రూ.100 నుంచి రూ.150లు వరకు వ్యాపారులు విక్రయిస్తున్నారు.



డీజిల్‌కాలనీ వద్ద ట్రాలీ ఆటోలో డ్రాగన్ ఫ్రూట్స్

100 గ్రాముల డ్రాగన్ ఫ్రూట్‌లో..

100 గ్రాముల డ్రాగన్ ఫ్రూట్‌లో 60 కేలరీల శక్తి, 13 శాతం కార్బోహైడ్రేట్లు, 3 శాతం ఫైబర్, సున్నా కొలస్ట్రాల్, 1.2 గ్రాముల ప్రొటీన్లు, పుష్కలంగా మినరల్స్, పాస్పరస్, జింక్, కాల్షియం ఉంటాయని వైద్యులు అంటున్నారు. కాగా, రూ.100లకే కిలో చొప్పున డ్రాగన్ ఫ్రూట్‌ను రోడ్లపై అమ్ముతుండడంతో చాలామంది కొనుగోలు చేస్తున్నారని పండ్ల వ్యాపారి మహ్మద్ ఇర్ఫాన్ తెలిపారు.

బీమా సొమ్ము అందజేత



బీమా సొమ్ము అందజేస్తున్న అమరేందర్ రెడ్డి

మామునూరు: ఖిలా వరంగల్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన శ్రీరామ పురుషుల పొదుపు సంఘం సభ్యుడు మేకల సదానందం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి భార్య వరలక్ష్మికి పొదుపు సంఘం అధ్యక్షుడు రాజు, ప్రతాపరుద్ర పురుషుల పొదుపు సమితి అధ్యక్షుడు బిల్లా అమరేందర్‌రెడ్డి ఆదివారం అభయ నిధి, సామూహిక బీమా కింద రూ.45 వేలను అందజేశారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు ముప్ప విజయ భాస్కర్, మేకల సతీష్, బైరి రమేష్, జీజుల సురేందర్, ముప్ప అశోక్, పోశాల శ్రీనాథ్, బండి శంకర్, గణకులు గోపరాజు సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



మడికొండ: మడికొండకు చెందిన వెటర్నరీ డాక్టర్ నటరాజ్ కుమార్ కుటుంబానికి తెలంగాణ వెటర్నరీ అసోసియేషన్ (టీవీఏ) ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. నటరాజ్ కుమార్ ఇటీవల మృతి చెందగా, ఆయన పెద్దకర్మకు కార్యవర్గ సభ్యులు ఆదివారం హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టీవీఏ ప్రధాన కార్యదర్శి రాము, మురళీధర్‌రావు, రవీందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద యువజన సంఘం ఎన్నిక

మడికొండ: గ్రేటర్ వరంగల్ వినాయక నగర్ వివేకానంద యువజన సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెనుకుల సతీష్, ఉపాధ్యక్షులుగా బోగి మహేష్, మండల సురేష్, ప్రధాన కార్యదర్శిగా మాచర్ల రంజిత్‌కుమార్, కోశాధికారిగా నిగ్గుల ప్రశాంత్, ప్రచార కార్యదర్శిగా నిగ్గుల రవి, కార్యవర్గ సభ్యులుగా బోగి మనోజ్‌కుమార్, నిగ్గుల వినయ్‌కుమార్, రాయికంటి ప్రణయ్, ఆర్.హరిప్రసాద్, గోపనబోయిన వీరేష్, ముష్కే శ్రీకాంత్, గుడికందుల శ్రీనివాస్, నిగ్గుల మధు, మురళి, రాకేష్, దువ్వ నరేష్, బోగి సత్యనారాయణ, ఎండి.అంకూస్, గౌరవ అధ్యక్షులుగా కుర్ల మోహన్, నిగ్గుల వెంకటప్రసాద్, కుక్కల సమ్మయ్య, మాచర్ల వీరస్వామి, గౌరవ సలహాదారులుగా గుడికందుల లక్ష్మణ్, బోగి రమేష్, కల్లెపు నరేష్, కల్లెపు కుమారస్వామి, కుర్ల ఐలయ్యను ఎన్నుకున్నట్లు కాంగ్రెస్ 64వ డివిజన్ అధ్యక్షుడు కుర్ల మోహన్, వాల్మీకి సంఘం జిల్లా సభ్యుడు నిగ్గుల వెంకటప్రసాద్ వెల్లడించారు.

బీసీ రిజర్వేషన్లకు కేంద్రం ఆమోదం తెలపాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు



కాజీపేటలో ధర్నా చేస్తున్న నాయకులు



హసన్‌పర్తి: నిరసన తెలుపుతున్న నాయకులు

హన్మకొండ: బీసీ రిజర్వేషన్లకు కేంద్రం ఆమోదం తెలపకపోతే బీజేపీకి పుట్టగతులుండవని సీపీఎం హనుమకొండ జిల్లా కమిటీ సభ్యులు వాంకుడోతు వీరన్న, టి.ఉప్పలయ్య విమర్శించారు. ఈ మేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పార్టీ వరంగల్ పశ్చిమ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్లు కల్పించాల్సి వస్తుందని అగ్రవర్ణ బీజేపీ మొదటి నుంచి బీసీ జనగణనను వ్యతిరేకిస్తోందని ఎద్దేవాచేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల సర్వే చేసి, 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని శాసనసభతో ఆమోదించి కేంద్రానికి పంపితే కేంద్రం అడ్డుకుంటోందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో కుక్కముడి రవీందర్, రవీంద్రచారి, రాధిక, బిల్ కిస్, సుదర్శన్ పాల్గొన్నారు.

కాజీపేటలో ధర్నా

కాజీపేట: బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ల బిల్లును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ఆమోదించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.చుక్కయ్య డిమాండ్ చేశారు. కాజీపేట మండల కేంద్రంలోని పోస్టాఫీసు సెంటర్‌లో పార్టీ కార్యకర్తలు ఆదివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదనే చట్టాన్ని సవరించి ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చి ఆమోదించాలని సూచించారు. ధర్నాలో మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య, కారు ఉపేందర్, జంపాల రమేష్, సంటి రవి, ఎండి.మస్తాన్ వలి, రామంచ సారంపాణి, అనిత, రాజు, మహేష్, లక్ష్మి, కవిత, మధు, పద్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

42శాతం రిజర్వేషన్లు.. బీసీల హక్కు

హసన్‌పర్తి: 42శాతం రిజర్వేషన్లు పొందడం బీసీల హక్కు అని సీపీఎం మండల కార్యదర్శి గుమ్మడి రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండల కేంద్రంలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్లు అమలు చేయడం కేంద్రం బాధ్యతగా పేర్కొన్నారు. రిజర్వేషన్లు అమలు చేయకుంటే నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు సుచెందర్, రజిత, సుమన్, మౌనిక, అనిఫా, రాజు, అజిమా పాల్గొన్నారు.

అమెరికా దుశ్చర్యలను వ్యతిరేకించండి



మాట్లాడుతున్న గన్నారపు రమేష్

ఖిలా వరంగల్: అమెరికా దుశ్చర్యలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని కార్మిక రైతు సంఘాల నాయకులు గన్నారపు రమేష్, ఈసంపెల్లి బాబు, రాచర్ల బాలరాజు, అరూరి కుమార్, ముక్కెర రామస్వామి డిమాండ్ చేశారు. భారతదేశ దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 50శాతం సుంకం విధించడానికి నిరసిస్తూ ఈ నెల 13న వరంగల్ చౌరస్తాలో కిసాన్ మోర్చా జాతీయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే దిష్టిబొమ్మ దహన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో రైతు సంఘ నాయకుడు సోమిడి శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ రష్యా నుంచి భారత్ చమురు దిగుమతి చేసుకోవద్దని అమెరికా బెదిరిస్తోందని అన్నారు. ప్రపంచంలోని ప్రతి దేశానికి ఇతర దేశాలతో వర్తక, వాణిజ్యాలు చేసుకునే హక్కు ఉందని గుర్తుచేశారు. భారత సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టు పెట్టవద్దని మోదీ ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు. అలాగే, భారత వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే అమెరికాతో ద్వైపాక్షిక ఒప్పందాలు చేసుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో మొగిలి ప్రతాప్‌రెడ్డి, వీరగోని శంకరయ్య, అక్కెనపల్లి యాదగిరి, బైరబోయిన ఐలయ్య, ఇంద్రసేన, వల్లందాస్ కుమార్, గంట శంకర్, రఘుసాల సుమన్, యాకూబ్ పాషా పాల్గొన్నారు.

75 మంది రైతులకు ఎఫ్‌పీఓ సభ్యత్వం



కాజీపేట: రైతు ప్రాథమిక సహకార సంఘంలోని 75 మంది రైతులకు ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీఓ) సభ్యత్వాన్ని కాజీపేట మండలం సోమిడి గ్రామ రైతు సంఘం కార్యాలయ ఆవరణలో ఆదివారం అందజేశారు. దర్గా కాజీపేట ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు ఊకంటి వనంరెడ్డి, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ కలిసి రైతులకు సభ్యత్వ రశీదులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎఫ్‌పీఓ స్కీంలో అర్హులైన రైతులు చేరాలని సూచించారు. సమావేశంలో సంఘం డైరెక్టర్లు మెరుగు రాజయ్య యాదవ్, కాయిత రాజ్‌కుమార్ యాదవ్, లింగం నరేందర్ రెడ్డి, గాలిరెడ్డి, బొల్లికొండ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.